మరమ్మతుల కారణంగా..

సైదాబాద్, అక్టోబర్ 10 : విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని పలుప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు డీఈఈ హనుమంత్ రెడ్డి తెలిపారు. 11 కేవీ శ్రావణి హాస్పిటల్ ఫీడర్, 11కేవీ సలీంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

రెండు తలల పాము అప్పగింత

రెండు తలల పాము మంగళవారం సైదాబాద్ వాణీనగర్ కాలనీలో లభ్యమైంది. కాలనీ వాసుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు పామును స్వాధీన పర్చుకున్నారు. ఖాళీ ప్రదేశంలో సంచరిస్తుండగా కాలనీ వాసి సత్య ప్రకాశ్‌యాదవ్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు అక్కడికి చేరుకొని పామును ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ సమక్షంలో అటవీశాఖ అధికారులకు అందజేశారు.

- సైదాబాద్, అక్టోబర్ 10

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

మలక్‌పేట శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ లీగ్ సీజన్-3 క్రీడా పోటీల్లో ట్రోఫీతో విజేతలు

మలక్‌పేట, అక్టోబర్ 10 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మలక్‌పేట ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల అన్నారు. మలక్‌పేట శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ ఒకటి నుంచి ఎనిమిది వరకు అల్మాస్‌గూడలోని మాస్టర్స్ క్రికెట్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ లీగ్ సీజన్ -3 పోటీలు నిర్వహించారు. శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతియేటా పోటీలు నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ పోటీల్లో క్రికెట్‌కు ఆరు టీమ్‌లకు కలిపి 90 మంది, 20 మంది చెస్ క్రీడాకారులు, మరో 20 మంది క్యారం క్రీడాకారులు పోటీల్లో పాలుపంచుకోగా, క్రికెట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చందన్ చాంప్, శ్రీ వెంకటేశ్వర ట్రెజరర్ కింగ్స్ టీం, క్యారంలో విన్నర్‌గా సుమిత్, రన్నర్‌గా తన్మయిజైన్, చెస్‌లో విజేతగా విజయ్‌జైన్, రన్నర్‌గా మహేశ్ కుమార్ నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే, మార్కెట్ చైర్‌పర్సన్ అనితానాయక్ బహుమతులు ప్రదా నం చేశారు. సమావేశంలో శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్, కార్యదర్శి దీపక్ మోడీ, కోశాధికారి పరశు రాం, సంయుక్త కార్యదర్శులు మహేశ్, భాస్కర్, సలహాదారుడు మహేందర్, మాజీ సభ్యులు సురేందర్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టు క్యాంటీన్ తనిఖీ

నాంపల్లి కోర్టుల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను తెలంగాణ పుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే ఈ క్యాంటీన్ జస్టిస్ సామ్‌కోషే చేతులమీదుగా ప్రారంభించబడింది. కల్తీ వంట సామగ్రి ఉపయోగించవద్దని, నాణ్యమైన ఆహారం న్యాయవాదులకు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని క్యాంటీన్ యజమానికి సూచించారు. న్యాయవాదులతో పాటు కక్షిదారులు వస్తారని మంచి ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తన వెంట నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ సభ్యులు, మాజీ ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు. **- నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)**

ఎన్నికలు సజావుగా సాగేలా..

ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిపేటట్లుగా రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కొమురయ్య అన్నారు. మంగళవారం గోల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆల్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, పోలింగ్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, జీహెచ్ఎంసీ సర్కిల్-13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, తహసీల్దార్ అహల్యారెడ్డి, కార్వాన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ, కృష్ణదాస్, అనూప్, వివిధ పార్టీల నాయకులు సత్యనారాయణ, జెన్న సుధాకర్ పాల్గొన్నారు. **- మెహదీపట్నం, అక్టోబర్ 10**

శుభాకాంక్షలు

మలక్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సైదాబాద్‌లోని తన నివాసంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఠాకూర్, దేవసారి కృష్ణ, పరమేశ్ ముదిరాజ్, గడ్డం నందు, పవన్, సంపత్‌రెడ్డి, శంకర్, చంద్రశేఖర్, కృష్ణ పాల్గొన్నారు. **- సైదాబాద్, అక్టోబర్ 10**

'ఆధునిక జీవనంలో ఒత్తిడి పెరిగింది'

అనిబీసెంట్ మహిళా కళాశాల విద్యార్థినులతో సైకాలజిస్ట్ డాక్టర్ విజయ భవాని

మలక్‌పేట, అక్టోబర్ 10 : ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడి పెరిగిపోయిందని సైకాలజిస్ట్, సోషల్ డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్, మంగ కార్ట ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విజయ భవాని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబీసెంట్ మహిళా కళాశాలలో మానసిక ఆరోగ్య వైజ్ఞానిక ప్రదర్శన, వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయ భవాని వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏడుగురిలో ఒకరు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని.. ప్రధాన కారణం ఆధునిక వ్యసనాలు సెల్‌ఫోన్ల వాడకమన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 శాతం మంది కౌమార దశలోనే వ్యసనాలకు బానిసలై మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, సైకాలజీ విభాగాధిపతి యశోద, అధ్యాపకులు మౌనిక, గాయత్రి, విద్యార్థినులు మేఘన, సౌమ్య, సాహితి, కోమల్, మానస పాల్గొన్నారు.

సైదాబాద్ డీఐగా షేక్ అన్వర్ పాషా

సైదాబాద్, అక్టోబర్ 10 : సైదాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ అన్వర్ పాషాను నియమిస్తూ నగర కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న రాజేశ్‌ను సీఐడీకి బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో నగర సీఐడీ విభాగంలో పనిచేస్తున్న షేక్ అన్వర్ పాషాను స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నియమించటంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

కూల్‌డ్రింక్ సప్లయింగ్ గోదాంలో అగ్నిప్రమాదం

విద్యుదాఘాతంతో కాలినట్లుగా అనుమానం

సైదాబాద్, అక్టోబర్ 10 : కూల్‌డ్రింక్ సప్లయింగ్ గోదాంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన కంచన్‌బాగ్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హఫీజ్‌బాబా నగర్‌లో ఉండే మహ్మద్ అక్తర్ ఖాన్ రోషన్ దౌలాలోని ఓల్డ్ డైమాండ్ హోటల్ సమీపంలో కూల్‌డ్రింక్ సప్లైయింగ్ గోదాంను నిర్వహిస్తున్నాడు. ఆ సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గోదాంలోనుంచి మంటలు వస్తున్నాయని స్థానికులు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే మహ్మద్ అక్తర్‌ఖాన్ అక్కడికి వెళ్లి చూడగా మంటలు ఎగిసి పడుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది, కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందించాడు. స్థానికుల సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేసిన తర్వాత చూడగా ఆఫీస్ పెట్టిన నగదు, స్టాక్, స్వీపింగ్ మిషన్లు, కూలర్స్, కంప్యూటర్, బిల్స్, గోదాం ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు కాలిపోయాయి. విద్యుదాఘాతంతో కాలిపోయినట్లుగా తమకు అనుమానంగా ఉందని, విచారణ జరిపించి చట్టప్రకారం చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కంచన్‌బాగ్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపున్నామని ఇన్‌స్పెక్టర్ జి. శేఖర్ రెడ్డి తెలిపారు.

ఓల్డేజ్‌హోంలో వాటర్ ప్లాంట్

ఫలక్‌నామాలోని ఫాతిమా ఓల్డేజ్ హోం ఆవరణలో ఆల్కలైన్ వాటర్‌ప్లాంట్‌ను న్యాయసేవాధికార సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముసలివాళ్లు ఒంటరివారు కారని, వారి సమస్యలకు న్యాయసేవాధికార సంస్థ పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. కేరింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, సంస్థ చైర్‌పర్సన్ ప్రేమావతి మాట్లాడుతూ.. సమస్యలు ఉంటే న్యాయసేవాధికారి కార్యదర్శి రాధికజైస్వాల్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఓల్డేజ్ హోం కార్యదర్శి వాసెఫ్, కో - ఆర్డినేటర్ అబ్దుల్‌వాసె, రజాక్, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

- నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)

మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు

కూరగాయలు	కిలో రూ.	కూరగాయలు	కిలో రూ.
ఆలుగడ్డ	20	సొరకాయ	10
టమాట	16	క్యాబేజ్	12
వంకాయలు	20	క్యారట్	30
బెండకాయ	20	క్యాలీఫ్లవర్	20
మిర్చి	30	దొండ	20
గోకరకాయ	20	కీర	25
చిక్కుడు	40	దోసకాయ	25
బిన్నీస్	40	క్యాప్సికమ్	34
బీరకాయ	20	బీట్‌రూట్	20
కాకరకాయ	20		

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు